క్లుప్తంగా

నేడు జాతీయ లోక్‌అదాలత్

సిద్దవటం : జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం సిద్దవటం కోర్టు ఆవరణలో నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దవటం అట్లూరు, ఒంటిమిట్ట మండలాల పోలీసు స్టేషన్ల పరిధిలోని అన్ని సివిల్, క్రిమినల్ తదితర కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. కక్షిదారులందరూ తమ తమ కేసులలో రాజీపడి వాటిని పరిష్కరించుకొని కోర్టుల చుట్టూ, పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరగకుండా విలువైన సమయంతోపాటు అనవసరమైన ఖర్చులను ఆదా చేసుకోవచ్చునన్నారు. వివరాల కోసం కక్షిదారులు సిద్దవటం కోర్టులో సంప్రదించాలని ఆయన అన్నారు.

నందలూరులో..



నందలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత పేర్కొన్నారు. శనివారం (నేడు) జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కోర్టు నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, పీఎల్‌వీలు, కక్షిదారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం

చిన్నమండెం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్ తెలిపారు. పంచాయతీ రికార్డుల నిర్వహణ, స్వరూప స్వభావం, గ్రామసభలు, పంచాయతీ ఆదాయం, పన్నుల చెల్లింపులు, గ్రామ పరిపాలన, సొంత ఆదాయ సమీకరణ తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్య, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కులగుణన పూర్తి చేయాలి

రాయచోటి టౌన్ : ప్రభుత్వం ప్రకటించిన తేదీలోగా కులగణన పూర్తి చేయాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు కులగణన పూర్తి చేయాలని అందుకు కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేశామని చెప్పారు. అందులో ఎలాంటి తప్పులకు తావు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేయాలని తెలియజేశారు. బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించేందుకు మైదానాలు సిద్ధం చేయాలన్నారు.

పశు బీమాతో లాభాలు

చిన్నమండెం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో పాడి పశువుల ప్రమాద బీమాపై పాడి రైతులకు అవగాహన సదస్సును నిర్వహించినట్లు పశుసంవర్ధక శాఖ డీడీ మాల కొండయ్య తెలిపారు. మండల పరిధిలోని కొత్తపల్లి, బండకాడ కురవపల్లె, మల్లూరు రైతు భరోసా కేంద్రాల్లో, కొత్తపేట, చిన్నమండెం వెటర్నరీ ఆసుపత్రులలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. పశుబీమాతో పాడి రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. పశువుల ప్రమాదబీమా, పాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గణేష్, సిబ్బంది రవికుమార్, రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిద్దాం

నందలూరు(రాజంపేట) : విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే వారు ఏ రంగంలోనైనా రాణిస్తారని నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఇసుకపల్లె ప్రాథమిక పాఠశాలలోని భవితా కేంద్రంలో ఎస్‌టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధరదేవి ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను జరిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, కో-ఆప్షన్ సభ్యుడు కలీం, క్రికెట్ ఆటగాడు శివకోటి, ఉపాధ్యాయులు లీలాకృష్ణ, పుల్లయ్య, లక్ష్మీనారాయణ, బీసీ నాయకులు హిమగిరి యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడలు, చిత్రలేఖనం ఆటలపోటీలలో పాల్గొన్న వారికి బహుమతులను అందజేశారు. అన్నదానం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఒంటిమిట్ట : మంగంపేట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం నడింపల్లి నుంచి నందలూరుకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న జల్లి చెన్నయ్య(35) మంగంపేట అభయాంజనేయస్వామి ఆలయ సమీపాన ఉన్న కడప-చెన్నై జాతీయ రహదారి పైకి వస్తుండగా.. అడ్డుగా ఆవులు వచ్చాయి. వాటిని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో చెన్నయ్య కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధితుడిని 108లో కడప రిమ్స్‌కు తరలించారు.

ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

- నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం
- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



రైతుకు ఆర్థిక సహాయం అందిస్తున్న హేమనవర్మ



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : తమది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఇటీవల మిచాంగ్ (మిగ్‌జామ్) తుపాన్ దాటికి వీపీఆర్ కండ్రిగ పంచాయతీలో నేలకొరిగిన అరటి, బొప్పాయి, మామిడి, పంటల రైతులతో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డితో కలిసి సచివాలయంలో కొరముట్ల ముఖాముఖీ నిర్వహించారు. ప్రభుత్వవిప్ మాట్లాడుతూ ప్రభుత్వం తుపానుని ధీటుగా ఎదుర్కొందన్నారు. తుపాను ప్రభావం తగ్గగానే సీఎం వైఎస్ జగన్ అధికారుల ద్వారా పంట నష్టంపై నివేదికలను తెప్పించుకున్నారని తెలిపారు. ప్రతి ఒక్క రైతుకు నష్ట పరిహారం అందిస్తామని, ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. వీపీఆర్ కండ్రిగ పంచాయతీలో 210 మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయని వారికి ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో రూ.50 కోట్ల పంట నష్టం జరిగినట్టు తెలుస్తోందని, పూర్తిస్థాయిలో నివేదికలు అందిన తరువాత ప్రతి ఒక్కరికి పంట నష్ట పరిహారం అందిస్తామని తెలియజేశారు. అలాగే 1992 సంవత్సరంలో గ్రామంలో అగ్ని ప్రమాదం జరగడంతో పలువురి రైతుల భూముల రికార్డులు, పాస్ పుస్తకాలు కాలిపోయినట్టు కొరముట్ల దృష్టికి రైతులు తీసుకువచ్చారు. తక్షణం స్పందించిన ఆయన కలెక్టర్‌తో మాట్లాడి మీకు నష్టపరిహారం అందించేటట్లు ఏర్పాటు చేసి, భూమికి సంబంధించి శాశ్వత హక్కు పత్రాలు కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఏనాడు రైతులకు మంచి చేసింది లేదన్నారు. రైతుల పక్షపాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని రాయిస్తున్న పిచ్చి రాతలను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ముప్పాల హేమన వర్మ, సుధాకర్‌రాజు, సుబ్బరామరాజు, సుదర్శన్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, ప్రతాప్‌రాజు, సర్పంచ్ రమేష్ వర్మ, ఎంపీటీసీలు ప్రసాద్‌రెడ్డి, బండారు మల్లికార్జున, కంపరాజు నాగేంద్రరాజు, హెచ్‌ఓ భాస్కర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుకు రూ.2 లక్షల ఆర్థికసాయం చేసిన హేమనవర్మ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని వీపీ కండ్రిగలో శివకుమార్‌రాజు అనే యువ రైతు ఈ ఏడాది 15 ఎకరాలలో అరటి పంట వేశాడు. పంట కోతకు వచ్చే సమయంలో తుపాన్ కారణంగా 15 ఎకరాలు అరటి నేలమట్టమైంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తూ రూ.2 లక్షల ఆర్థిక సాయన్ని శుక్రవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిల చేతులమీదుగా రైతు శివకుమార్‌రాజుకు అందించారు.

రేపు మండలానికి ఎమ్మెల్యే

గాలివీడు : ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వస్తున్నట్లు ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్ మొహిద్దీన్(ఎస్‌కే)లు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తూముకుంట, వెలిగల్లుల్లో తారు రోడ్ల ప్రారంభంతోపాటు వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్‌లో 8 లక్షల చేప పిల్లలను వదలుతారన్నారు. అలానే మండల కేంద్రంలో సిమెంటు రోడ్లు, నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం, పెడకంటి కొత్తపల్లెలో పలు కుటుంబాలను పార్టీలోకి చేర్చుకోవడం, అనంతరం గోపనపల్లె, గుండ్లచెరువు కార్యాలయాల ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు.

సీఎం జగన్‌ను గెలిపించుకుందాం

గాలివీడు : రాష్ట్రంలో బడుగు, బలహీన సంక్షేమ రథసారధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గాలివీడు-2 గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, వెంకటరెడ్డి, నిజాముద్దీన్, గంగాధర్‌నాయుడు, సుబ్బారెడ్డి, నాగభూషన్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రారంభమైన రాజగోపుర మహోత్సవములు



కలశాలను తీసుకొస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, అర్చకులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయ పశ్చిమ రాజగోపుర కుంభాభిషేక, సాలహార మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వేదపండితుల వేద మంత్రోచ్ఛరణలతో యాగశాల ప్రవేశంతో ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవం ఉదయం శుక్రవారం 7 గంటలకు యాగశాలలో హోమం నిర్వహించి తరువాత గణపతి పూజను నిర్వహించారు. ఈ పూజలలో భాగంగా నవగ్రహ యండపారాధన, తరువాత అష్టదిక్పాలక పూజలు, వాస్తు పూజలు, పంచాచార్యుల పూజ, చండీ హోమం, అగ్నిప్రతిష్ఠ, కలశం ధాన్యాధివాసము తదితర కార్యక్రమాలు జరిపారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పి.దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు, రుత్వికలు, ఆలయ ప్రధాన అర్చకులు చేశారు. ఈ పూజలలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ కుటుంబ సభ్యులు, డీఆర్‌ఓ కుటుంబ సభ్యులు, దేవాదాయశాఖ డీఈ గంగయ్యలు పాల్గొన్నారు. అనంతరం భద్రకాళికి రాహుకాల పూజలు చేయగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

పశువులకు టీకాలు

రాజంపేట రూరల్ : మిచాంగ్ తుపాన్ ప్రభావ గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు వై.విజయభాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు టీకాలు వేశారు. ఇందులో భాగంగా మండలంలోని మందరం గొల్లపల్లె గ్రామంలో 77 పాడి పశువులకు గొంతువాపు టీకాలు, 255 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేసినట్లు ఉప సంచాలకులు తెలిపారు. అలాగే 180 పాడి పశువులు, గొర్రెలు, మేకలకు పిడుదల నివారణ మందులను వేశామన్నారు. ఈసందర్భంగా రైతులకు పశుఆరోగ్య సంరక్షణ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాసంచాలకులు కె.ప్రతాప్, అత్తిరాల వైద్యాధికారి భాగ్యవతి, ఎం.వరదయ్య, ఏఏహెచ్ విద్యాసాగర్, గోపాలమిత్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకారంలో పేరంటాలమ్మ

పుల్లంపేట : మండల పరిధిలోని సాధువారిపల్లెలో వెలసిన పేరంటాల అమ్మవారికి శుక్రవారం వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునుంచే అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున గ్రామప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మధ్యాహ్నం దాతలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నరసింహ కుమార్ అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు.

పేదలకు భరోసా కల్పించేలా వైద్య సేవలు



రాయచోటి టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



లక్కిరెడ్డిపల్లె: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రులపై పేదలకు ధైర్యం, నమ్మకం, భరోసా కల్పించేలా వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. రాయచోటి ప్రజల కోసం నూతనంగా నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ఈ నెల 21న ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అప్పటిలోపు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్‌కు తెలిపారు. ఓపీ సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రభుత్వ ఆస్పత్రులపై రోగులకు నమ్మకం, ధైర్యం, భరోసా కలిగేలా చూడాలన్నారు. ఆస్పత్రిలో మూడు ఆపరేషన్ థియేటర్లు అవసరం ఉన్నట్టు తెలుసుకుని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి తెలియజేశారు. ఏసీలు, లిఫ్టులు ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. అలానే నూతన భవనంలో సోమవారం నుంచి వైద్య సేవలు ప్రారంభించాలని చెప్పారు. మెడికల్, సర్జికల్ విభాగం నిర్వహణపై వివరణ కోరగా అధికారులు మెడికల్, సర్జికల్ విభాగానికి సంవత్సరంలో రూ. 80 లక్షలు ఖర్చు అవుతున్నట్లు తెలిపారు. అనంతరం దయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణం అంతా పచ్చగా కనిపించే విధంగా పచ్చని చెట్లు పెంచాలని తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, ఆస్పత్రి కమిటీ సభ్యులు బేపారీ మహమ్మద్‌ఖాన్, ఫమీదా, సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, డాక్టర్ బండారు కిరణ్‌కుమార్, డాక్టర్ రెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ కోటేశ్వరమ్మ, డాక్టర్ ఖదీర్ బాషా, ఏపీఎంఎస్‌ఐడీసీ డీఈ రాజగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు ఆసీఫ్ అలీఖాన్, కొలిమి చాన్ బాషా, షబ్బీర్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్, గౌస్ ఖాన్, కసిరెడ్డి వెంకటనరసింహారెడ్డి, అన్నా సలీం, కొత్తపల్లె ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంబలం పూజ

లక్కిరెడ్డిపల్లె : అయ్యప్ప దీక్ష ఆరోగ్య రక్ష అని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం రాత్రి లక్కిరెడ్డిపల్లె మండలం దిన్నెపాడు గ్రామం పర్వతరెడ్డిగారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి అంబలం పూజలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. పూజ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 18 మెట్ల మండపం భక్తులను ఆకట్టుకుంది. మాలధారులు భజనలో పాల్గొన్నారు. అనంతరం సుదర్శన్ ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం. సుదర్శన రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ ఏ.రెడ్డయ్య, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి నాగరాజు

సిద్దవటం : వరిలో రబీ సీజన్‌లో కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉన్నందును వరి నారు కొసలను తుంచి నాటుకోవాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ రైతులకు తక్షణమే యూరియా, డీఏపీ ఎరువులను సరఫరా చేయాల్సిందిగా కోరడమైనదన్నారు. అలాగే నూర్పిడి పట్టలు (పాలిథిన్ షీట్), వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు, జింక్ సల్ఫేట్ సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయాలన్నారు. రబీలో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని జింక్ సల్ఫేట్ , పొటాష్ తప్పనిసరిగా వాడాలన్నారు. తరువాత సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ - పంట నమోదు చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. తరువాత రైతు భరోసా కేంద్ర సహాయకులకు సాంకేతిక అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వారికి నానో యూరియాపై అవగాహన కూడా కల్పించామన్నారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతు భరోసా కేంద్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తితో వనితలకు మరింత భరోసా



లబ్ధిదారులకు ఆటో తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకొచ్చిన ఉన్నతి మహిళా శక్తి పథకంతో వనితల జీవనానికి మరింత భరోసా కల్పించిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత హోటల్ వద్ద ఉన్నతి మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన 4 మహేంద్ర ఆటోలను మేడా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆటోలు పొందిన వారిలో చింతకాయల వెంకటసుబ్బమ్మ, యాకసిరి ఆదిలక్ష్మి, సిద్దవటం మండలం నుంచి కల్లోజీ ఇందిర, ప్రసన్న కుమారిలు ఉన్నారు. పంపిణీ అనంతరం మహిళా ఆటో డ్రైవర్లలో ఆర్థిక భరోసా కల్పించేందుకు మొదటగా ఆటోలలో ప్రయాణించి వారికి నగదును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు ఉన్నతి మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. లబ్ధిదారులు ఆటో కొనుగోలులో పెట్టే ఖర్చులో 10 శాతం చెల్లిస్తే 90 శాతం రుణం సెర్ప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసుల రెడ్డి, ఎంపీటీసీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతరాజుపల్లి రమణ, పిడుగు సుబ్బారెడ్డి, కట్టా నారాయణ, భాస్కర్, కృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మట్లి నారాయణరెడ్డి, వెంకట సుబ్బయ్య, గంగపేరూరు కృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి



ఆడుదాం ఆంధ్ర కిట్లను అందజేస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : క్రీడాభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కిట్లను సచివాలయల సెక్రటరీలు, పీఈటీలకు అందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఏ ప్రభుత్వంలో చేయని విధంగా క్రీడలకు వైఎస్సార్‌సీపీ పాలనలో పెద్దఎత్తున ప్రాధాన్యనత ఇస్తున్నారు. క్రీడలను ప్రోత్సహించి, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆడుదాం ఆంధ్రాకు విశేష సంఖ్యలో స్పందన లభించిందన్నారు.

జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు



వైఎస్సార్‌సీపీ జెండావిష్కరణలో నాయకులు

సంబేపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గురిగింజకుంట పంచాయతీలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వి.వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్ రెడ్డి, నాయకుడు ద్వారకనాథ రెడ్డి, ఈఓపీఆర్‌డీ రవీంద్రనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్ 10 నుంచి ఉచిత కంటి వైద్యశిబిరం

ఓబులవారిపల్లె : శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో డిసెంబర్ 10 నుంచి వారం రోజులపాటు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు, హోండా షోరూంల (పలు ప్రాంతాల్లో) అధినేత మల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. తన తండ్రి దివంగత మల్లు వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ముక్కావారిపల్లె టీటీడీ కళ్యాణమండపంలో వలంటీర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముక్కావారిపల్లె టీటీడీ కళ్యాణమండపంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరి సహకారం అవసరమన్నారు. వలంటీర్లు తమ పరిధిలోని కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి వైద్య శిబిరానికి వచ్చేలా చూడాలన్నారు. వైద్య శిబిరంలో హాజరైన వారికి వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. వైద్య శిబిరం నిర్వహణకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కంటి రోగులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకులు పీస్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సత్వరమే స్పందించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గెడ్డం జనార్దన్‌రెడ్డి

ఒంటిమిట్ట : మండలంలో ఉన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు సత్వరమే స్పందించాలని వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న సమావేశ భవనంలో వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు వారివారి శాఖలకు సంబంధించి చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే కొంత మంది ప్రజాప్రతినిధులు పలు సమస్యలను పరిష్కరించాలంటూ సభా దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీఓ సోమశేఖర్, ఈఓపీఆర్‌డీ రంగయ్య, కో-ఆప్షన్ మెంబర్ ఎస్.ఎం.డి. రఫీ, ఎంపీటీసీలు సుప్రియ, లక్ష్మీప్రసన్న, నారాయణ రెడ్డి, రామలక్షుమ్మ, బాషా, సర్పంచులు సుజాత, లక్ష్మీనారాయణరెడ్డి, శివనారాయణ, రామలక్షుమ్మ, బాదుల్లా, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



ఈవీఎం పనితీరు గురించి వివరిస్తున్న అధికారి

రాజంపేట రూరల్ : ఈవీఎంల పనితీరుపై మన్నూరు జెడ్పీహెచ్ఎస్‌లో రెవెన్యూ అధికారులు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలి, వేసిన ఓటును ఎవరికి వేసింది ఎలా నిర్ధారించుకోవచ్చు అన్న విషయాలను ఓటర్లకు అధికారులు వివరించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ మిర్యాల సురేఖ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో నీటి నిల్వ



ఇంకుడు గుంతను తయారీ చేస్తున్న విద్యార్థులు

చిన్నమండెం : ఇంకుడు గుంతలతో వర్షపునీటిని నిల్వ ఉంచవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని ఎలా నిల్వ చేస్తారో విద్యార్థులకు మోడల్ స్కూల్‌లో వివరించారు.

ఇందుకు గాను పాఠశాల ఆవరణలో 4/5 పొడవు, వెడల్పు ఒక ఇంకుడు గుంతను విద్యార్థులచే తయారు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

తంబళ్లపల్లె: సారా విక్రేతను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఎగువసుగాలి తండాకు చెందిన శీనానాయక్‌ను అరెస్టు చేసి 9 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

తల్లిదండ్రులు సహకరించాలి

పుల్లంపేట : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు సహకరించాలని ఎస్‌బీవీడీ కరస్పాండెంట్ శ్రీరాములు, ప్రిన్సిపాల్ బాలాజీలు తెలియజేశారు. శుక్రవారం ఎస్‌బీవీడీ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోవు పరీక్షా సమయం విద్యార్థులకు ఎంతో విలువైనదన్నారు. అందుకే సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల వరకు జూనియర్ కళాశాలలో స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాలలో తాము విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పుతామని, అయితే తల్లిదండ్రుల వద్ద నుంచి వచ్చే ధైర్యం విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అవుతుందన్నారు. నేటి నుంచి పరీక్షలు ముగిసేవరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.